

# ప్రశ్నలు

ఎస్. వెంకటేశ్వర రెడ్డి

నన్నిప్పుడు పరిచయం చేసుకోవాలంటే చాలా కష్టం. ఇప్పుడు నేను పరుగెడ్తున్నాను. నిజం చెప్పాలంటే పారిపోతున్నాను. పారిపోవాలని లేదు. కానీ ఏం చెయ్యను. పరిస్థితి అలాంటిది. గంట నుంచి పరుగెట్టి పరుగెట్టి ఆయాసం వస్తోంది. అయినా ఆగలేని పరిస్థితి.

హమ్మయ్య! ఇక్కడేదో కొండలు, గుట్టలు కనిపిస్తున్నాయి. వీటి వెనుక దాక్కుంటే ఎవరికంటా పడకుండా వుంటాను.

ఆగండి. నన్ను కాసేపు ఊపిరి పీల్చుకోనివ్వండి. తర్వాత చెబుతాను నా కథ. కథలు రాద్దామని కలలు కన్న నా కథ. నాకు తెలుసు మీరు ఇది నిజమని నమ్మరని. కానీ నమ్మాల్సిందే.

ఇది నా కథ.

సంవత్సరం క్రితం వున్న ఉద్యోగం వదిలేశాను. అలా అని అందరికీ చెప్పుకుని తిరుగుతున్నా. నిజానికి నన్ను ఉద్యోగంలోంచి పీకేశారు. నాకు పని చేత కాక కాదులెండి. అంతకుముందు సంవత్సరమే 'ఉత్తమ ఉద్యోగి' పురస్కారం పొందిన వాడిని నేను.

నాకు నా ఉద్యోగం నచ్చలేదు. జీవితంలో నాకు నచ్చనిది ఏమైనా వుందంటే అది కేవలం స్థిరత్వం మాత్రమే. ప్రతి రోజూ ఒకే టేబుల్ ముందు కూర్చుని చేసిన పనే రోజూ చేస్తుండే రొటీన్ జీవితం నాకు నచ్చలేదు. నా మనస్తత్వం అలాంటిది. ఎప్పుడూ కొత్తదనం కోసం పాకులాడే నా మనస్తత్వానికీ నా ఉద్యోగానికి ఎలాంటి పొంతన కుదర్లేదు. జీవితమంటే ఒక ఉద్యోగం, తర్వాత పెళ్లి, పిల్లలు, వారి చదువులు అని నమ్మే ఫిలాసఫీ కాదు నాది. జీవితంలో ఏదో సాధించాలనే తపన. అది ఏంటో తెలియదు. కొన్నాళ్లు సమాజసేవ చేద్దామనుకున్నాను. కొన్నాళ్లు పెయింటింగ్ చేద్దామనుకున్నాను. మరి కొన్నాళ్లు తపస్సు చేద్దామనుకున్నాను. కానీ మనసులో ఏదో తెలియని అనుమానం. ఏం చెయ్యాలో తెలియదు కానీ ఈ ఉద్యోగం మాత్రం చెయ్యాలనిపించక పని చేయడం మానేశాను. మూడు నెలలు నన్ను భరించి ఉద్యోగం లోంచి పీకి పడేశారు ఆఫీసువాళ్లు.

నాకెలాగూ ఆ ఉద్యోగం మీద బోర్ కొట్టేయడంతో నాకు పెద్దగా బాధగా కూడా ఏమీ అనిపించలేదు. కానీ లోకానికి మాత్రం ఉద్యోగం నచ్చక మానేశానని మాత్రం చెప్పుకునేవాడిని.

పరవళ్లు తొక్కుతూ ముందుకు సాగే సెలయేరులా జీవితం వుండాలన్నది నా సిద్ధాంతం. ఆఫీసులో పనిచేస్తూ కూడా మల్లె తీగెలా పైపైకి ఎగబాకుతూ అత్యున్నత స్థాయికి ఎదగవచ్చని తెలిసినా, మల్లె తీగకు కూడా ఏదో ఒక ఆధారం దొరికితే గానీ పైకి ఎదగలేదు కదా! అలా ఎదగాలంటే నాపై ఆఫీసర్లని కాకా పట్టాలి, పొగడాలి. అవన్నీ నా స్వభావానికి విరుద్ధం.

అందుకే హద్దులు లేని జీవితం గడపాలనే ఆశతో ఉద్యోగం భారినుంచి బయటపడ్డాను.

కొన్నాళ్లు ఏం చెయ్యాలో తెలియలేదు. ఆ ఊరు ఈ ఊరు తిరిగేవాడిని. కొన్ని రోజులు ఊటీలో మరికొన్ని రోజులు కన్యాకుమారిలో గడిపాను. ఒక నెలరోజులు కేరళలోని బీచ్‌లన్నీ తిరుగుతూ సరదాగా జీవితాన్ని గడిపేశాను. ఊరు కాని ఊర్లో భాష అర్థం కాని ప్రదేశాల్లో కొత్త వ్యక్తుల్ని పరిచయం చేసుకుంటూ ఆనందంగా గడిపేస్తున్న ఆ రోజుల్లో కేవలం బీచ్ ఒడ్డున కూర్చుని బీర్ కొడుతుంటే నాకొక గొప్ప ఆలోచన తట్టింది.

ఎన్నాళ్లగానో నా మనసులో దాగి వున్న కవి ఒక్కసారిగా విజృంభించాడు. కేరళ అందాలను వర్ణిస్తూ కవితల మీద కవితలు రాసేసాను. ఒక రోజులాగే బీచ్‌వడ్డున వెన్నెల వెలుగులో కూర్చుని కవితలు రాస్తుంటే ఒక అమెరికా అమ్మాయి వచ్చి పక్కన కూర్చుంది. ఏమి రాస్తున్నావని అడిగింది. వచ్చీరాని ఇంగ్లీష్‌లో. నా కవితల్ని ఇంగ్లీషులో అనువదించి చెప్పేసరికి నన్ను గట్టిగా కౌగిలించుకొని నా కవిత్వం అద్భుతంగా వుందంది. ఆరోజే నాకర్థమయ్యింది. నేనెదురు చూసిన నా జీవితం నా కళ్ళముందు ప్రత్యక్షమయింది.

నేను కవిని, రచయితను అయిపోయినంత గొప్ప ఆనందం కలిగింది. ఆ రోజు రాత్రి నోబెల్ పురస్కారం పొందినట్టు కల కూడా రావడంతో తర్వాత రోజు ఉదయాన్నే లగేజీ మొత్తం సర్దుకుని హైదరాబాదు వచ్చిపడ్డాను. దొరికిన తెలుగు పుస్తకాలన్నీ చదివేశాను. ఒక నెలరోజులపాటు పుస్తకాలు చదవడం తప్ప మరే పనీ చెయ్యలేదు. చదవగా చదవగా నాకొక విషయమర్థమయ్యింది. ప్రజల మనసులు స్పందింపచేసేలా రచనలు చేయాలంటే ప్రజల మనసుల్ని అర్థం చేసుకోవాలని.

అప్పటివరకు ఒంటరిజీవితం గడుపుతూ ప్రజలకు దూరంగా వుంటున్న నాకు ప్రజల మనసులు ఎలా అర్థం చేసుకోవాలో తెలియదు. మనిషి బాధపడడానికి కారణమేంటి. అతని సంతోషానికి కారణమేంటి? ప్రజలు ఎప్పుడు ఏడుస్తారు? ఎప్పుడు నవ్వుతారు? ఎందుకు భయపడతారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు తెలుసుకోనిదే మంచి రచయిత కాలేననిపించింది. వీటన్నింటికి సమాధానాలు తెలుసుకోవడమెలా? మిమ్మల్నడిగితే మీరు చెప్తారా? తప్పకుండా చెప్పరు. నాకు ఖచ్చితంగా తెలుసు. ఇలాంటి ప్రశ్నలకు ఎవరూ సమాధానం చెప్పరని. అందుకే ఆరోజు నుంచి ప్రజలను అనుసరిస్తూ వారి జీవన విధానాన్ని గమనించడం మొదలుపెట్టాను.

అనాలోచితంగా ఎవరో ఒక వ్యక్తిని అనుసరిస్తూ గంటలు గంటలు గడిపేసేవాడిని. ఒక్కొక్క రోజు చిన్న పిల్లల్ని, మరొక రోజు ముసలివాళ్లని అనుసరించేవాడ్ని. ఒక రోజు కనిపించిన వ్యక్తి మరో రోజు కనిపించేవాడు కాదు. పదిహేను రోజులు యాదృచ్ఛికంగా ఎవరు కనపడితే వారి వెంటపడిపోయేవాడిని.

ఒకరోజు ఒక వ్యక్తిని ఉదయం నుంచి సాయంత్రం దాకా వెంబడించాను. దారి తెలియని బాటసారిలా వూరంతా తిప్పించాడు. ఆయనతో పాటు నేను కూడా ఊరంతా తిరిగాను. హైదరాబాదులో నేను చూడని ఎన్నో ప్రదేశాలు ఆయన దయవలన చూడగలిగానా రోజు. సాయంత్రమయ్యింది. ఉదయాన్నుంచి అతని వెంటే తిరుగుతున్నా ఉపయోగపడే విషయం ఒక్కటి కూడా తెలియకపోవడంతో చాలా కోపమొచ్చినా ఓపిక చేసుకుని అనుసరించసాగాను. రాత్రి పదకొండు గంటల కనుకుంటూ ఒక బస్‌స్టాప్‌లో పడుకొని హాయిగా నిద్రపోసాగాడా వ్యక్తి.


అపరిచితుల్ని అనుసరిస్తూ వారి జీవన విధానాన్ని అర్థం చేసుకోవడమే నా లక్ష్యం అయినా కూడా ఇలా ఉదయాన్నుంచి సాయంత్రం వరకూ ఏ పనీ చెయ్యకుండా ఊరంతా తిరిగి తనతో పాటు నన్నూ తిప్పించుకున్న ఆ వ్యక్తిని చూసి నాకు చాలా కోపమొచ్చింది. నిద్రపోతున్న అతన్ని లేపి ఎందుకిలా ఉదయాన్నుంచి ఊరంతా తిరిగావని అడిగాను. అతని సమాధానం విని నాకు పిచ్చెక్కింది. వింటే మీకు కూడా పిచ్చెక్కుతుంది. ఎందుకంటే అతను చెప్పిన సమాధానమేంటో తెలుసా? ఆ వ్యక్తికి పిచ్చని, అందుకే అలా తిరుగుతున్నాడని చెప్పడంతో నాకొక విషయం అర్థమయ్యింది. నేనలా ఎవర్ని పడితే వాళ్లని వెంబడించకూడదని అర్థమయ్యింది.

మంచి కవిత రాయాలంటే ఒక అందమైన వనిత పరిచయం అవసరమని చాలామంది రచయితల రచనలు చదివితే అర్థమయింది. అందుకే ఆ తర్వాత రోజు ఉదయాన్నే ఒక అందమైన వనితకోసం అన్వేషిస్తూ బయల్దేరాను. హైదరాబాదులో అందమైన అమ్మాయిలకు కరువా? చాలామంది అమ్మాయిల్నే చూసాను. అందంగానే వున్నారు కానీ ప్రతి ఒక్కరిలో ఏదో ఒక లోపం. నవ్వు బాగా లేకపోవడమో, నడకబాగా లేకపోవడమో.

సాయంత్రమయింది. నా అన్వేషణ ఫలించలేదు. చీకటితో పాటు నిరాశ నన్ను చుట్టుముట్ట సాగింది. భారంగా అడుగులేసుకుంటూ టాంక్ బండ్ మీదుగా నడుస్తుంటే ఒక విచిత్రం జరిగింది.

ఆరోజుకు గుడ్‌బై చెప్పేసి సూర్యుడు అస్తమిస్తున్న సమయం అది. అక్కడక్కడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఉదయం నుంచీ నడుస్తూ హైదరాబాదంతా తిరుగుతున్న నా చెవులకు సంగీతంలా వినిపించిందో నవ్వు. పియానో మీటినట్లుగా అనిపించిన ఆ నవ్వు వినిపించిన వైపు దృష్టి సారించాను. ఆ క్షణంలోనే నా జీవితం ఒక పెద్ద మలుపు తిరిగింది. అంతవరకూ గుంపులు

## ఆరోగ్యానికి రోజూ నడక



ప్రతిరోజూ కనీసం గంట సేపు నడిచినా, కొవ్వు పదార్థాలను తినడం తగ్గించినా ఛాతీ సంబంధవ్యాధుల్ని నిరోధించవచ్చని అమెరికన్ డైటిక్ అసోసియేషన్ పరిశోధకులు తెలియజేస్తున్నారు. కొవ్వు పదార్థాలను తిన్నవెంటనే రక్త నాళాల పనితీరు మందకొడిగా తయారవుతుందని వీరి పరిశోధనలో రుజువు చేశారు. మనం తీసుకునే ఆహార పదార్థాల ద్వారా రక్తంలో తయారయ్యే కొవ్వును ట్రైగ్లిజరైడ్స్ అంటారు. ఈ కొవ్వు పదార్థం రక్తంలో ఎక్కువగా తయారయితే అది గుండెజబ్బులకు, మధుమేహానికి దారితీస్తుంది. చిన్నచిన్న రక్తనాళాలు వ్యాయామం అలవాటు లేని వారిలో కన్నా క్రమం తప్పకుండా నడిచేవారిలో 25 శాతం ఎక్కువగా వ్యాకోచిస్తాయి. అలా వ్యాకోచించే రక్తనాళాలు ఆరోగ్యకరమైన రక్తప్రసరణకు గుర్తు. దీనివలన గుండె సురక్షితంగా వుంటుంది. అధికంగా కొవ్వు పదార్థాలు తీసుకుంటే, అవి రక్తనాళాలను మందకొడిగా మారుస్తాయి. అంటే రక్త ప్రసరణ సక్రమంగా వుండదు. రోజూ ఒక గంట సేపు నడిస్తే ఈ సమస్యనుంచి సులభంగా బయటపడవచ్చని కూడా వీరి పరిశోధనలో తేలింది. అంతే కాదు ఎంత ఎక్కువగా నడిస్తే గుండెకు అంతమంచిదని కూడా పరిశోధకులు వెల్లడిస్తున్నారు. దీంతోపాటు కొవ్వు 30 శాతం మేరకు తక్కువగా వున్న ఆహారపదార్థాలను తీసుకుంటే ఆరోగ్యం గురించి ఇక చింతించనవసరమే లేదంటున్నారు.

గుంపులుగా తిరుగుతున్న జనమంతా ఒక్కసారిగా మాయమయిపోయారు. ట్రాఫిక్ శబ్దాలేవీ వినిపించలేదు. గాలికి ఎగిరిపోతున్న పొడుగాటి వెంట్రుకల్ని ఒక చేత్తో సవరించుకుంటూ మరో చేత్తో సెల్‌ఫోన్‌లో నవ్వుతూ మాట్లాడుతున్న ఆమెను ఆరోజు నేను చూడకపోయి వుంటే ఇవాళ నా జీవితం ఇలా వుండకపోదును.

ఆమె అందాన్ని ఏమని వర్ణించను. ఆమె అందం ట్యాంక్‌బండ్ చుట్టుప్రక్కల ప్రదేశాలన్నింటినీ మరింత సౌందర్యమయం చేసింది. గులాబీ రంగు చీరలో, స్లీవ్‌లెస్ జాకెట్‌లో అందానికే అందంలా అనిపించిన ఆమెను చూస్తూ కాలం స్తంభించిపోతే బాగుండునిపించింది. అలా ఎంత సేపు ఆమెను చూస్తూ కూర్చున్నానో తెలియదు. నా కళ్లముందు నుంచి ఎలా మాయమయిపోయిందో తెలియదు. అప్పటివరకూ నేను కలగన్నానేమో అనే అనుమానం కూడా కలిగింది.

రెండు రోజుల తర్వాత అదే టాంక్‌బండ్‌పై ఆమె కనిపించకుండా వుంటే మొదటిసారి ఆమెను చూడడం కలే అని నమ్మేసేవాడిని. రెండోసారి మాత్రం ఆ మిస్‌ను మిస్ చేయదల్చుకోలేదు. నా హృదయాన్ని వీణలా మీటిన ఆమె ఎవరో తెలుసుకోవాలనే తాపత్రయం ఎక్కువయింది. ఎంతో ఆలోచించాను. కానీ అపరిచితురాలైన స్త్రీ పరిచయమెలా చేసుకోవాలి? నాకసలే లోకజ్ఞానం తక్కువ. ఎలా ఎలా అని ఆలోచిస్తుండగానే అటుగా వచ్చిన కారులో ఆమె తుర్రుమంది.

రెండుసార్లు కనిపించినట్లే కనిపించి మాయమైపోయిన నా కావ్యసుందరిని ముచ్చటగా మూడోసారైనా అనుసరించి ఆమె గురించి తెలుసుకొని, ఆమెనర్థం చేసుకొని ఆమె అందానికి బానిసనై నాలో కలిగే ప్రేరణతో పెద్ద కవినైపోవాలనే కుతూహలం బాగా పెరిగిపోయింది. అందుకే ఉన్న డబ్బులన్నీ పోగుచేసి ఒక సెకండ్ హ్యాండ్ స్కూటర్ కొని ఆమె గురించి అన్వేషిస్తూ బయల్దేరాను.

రోజూ సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఎవరి కోసమో ఎదురుచూడడం, తర్వాత కారెక్కి ఏ స్టార్ హోటల్‌కో వెళ్లడం ఆమెతో పాటు నా దినచర్య అయిపోయింది. కొన్ని రోజులు ఏవిధమైన అభి వృద్ధిలేని నా ప్రయత్నం ఎప్పటికి ఫలిస్తుందో అర్థం కాక మనసు భారమయ్యేది. రోజుకొక కారులో షికారు, రోజుకో స్టార్ హోటల్ తిరగడం చూసి ఆమె బాగా డబ్బున్న అమ్మాయని మాత్రం అర్థమయింది. అంత డబ్బున్న అమ్మాయి పేద వాడినైన నాతో పరిచయానికి ఒప్పుకుంటుందో లేదో అనే అనుమానం నన్ను వేధిస్తూనే వుండేది.

రోజులు వారాలయిపోసాగాయి. మూడు వారాలు దాటినా కూడా నా ప్రయత్నాలేవీ ఫలించలేదు. నాలుగో వారంలో నా కథ ఒక అనూహ్యమైన మలుపు తిరిగింది.

ఎప్పటిలాగానే ఆమె అందాన్ని ఆస్వాదిస్తూ కాస్త దూరంలో నిల్చున్నాను. వున్నట్టుండి ఆమె నా వైపు రాసాగింది. ఒక్కసారిగా నా గుండె ఆగిపోయినంత పనయింది. మూడు వారాలుగా ఆమెకు తెలియకుండా ఆమెను అనుసరించే సంగతి ఆమెకు తెలిసిపోయిందేమోనని నాకు ఒళ్లంతా చెమటలు పట్టేశాయి. ఆమె ముందుకొస్తున్న ఒక్కొక్క అడుగుతో నా ప్రాణం కొంచెం కొంచెం పోసాగింది. ఆమె వస్తున్నది నాకోసమో కాదో అని నా చుట్టుపక్కల చూసుకున్నాను. నా దరిదాపుల్లో ఎవరూ లేరు. భయంతో వణికిపోతున్న నన్ను అదోలా చూసి టైమెంతయిందని అడిగేసరికి పోయిన ప్రాణం లేచివచ్చినట్టయ్యింది.

అలా మొదటిసారిగా ఆమెతో మాట్లాడే అవకాశాన్ని దొరికించుకున్న తర్వాత ప్రతిరోజు ఆమెను చూడడం, ఆమె నన్ను చూసి చిరునవ్వులు చిందించుతుండడంతో ఆమెతో పరిచయం కష్టం కాలేదు. ఒకరోజు ధైర్యంగా వెళ్లి ఆమెతో మాట్లాడేశాను. అప్పటికింకా రచయిత కావాలని కలలు కంటున్నా, రచయితనయిపోయి నాలుగైదు పుస్తకాలు రాసేసినట్టు అబద్ధాలు చెప్పేశాను. ఆమె కూడా తన పేరు చెప్పింది. ఏదో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగమని కూడా చెప్పింది. ఆరోజే చెప్పేద్దామనుకున్నాను నా గురించి, రచయిత నవ్వాలన్న నా కలల గురించి. కానీ అన్ని రోజులు ఆమెకు తెలియకుండా ఆమెను అనుసరిస్తున్నానని తెలిస్తే ఎలా స్పందిస్తుందో అర్థంకాక చెప్పలేదు. నా గురించి నా రచనల గురించి ఆమె అడుగుతున్న సమయంలో పానకంలో పుడకలా ఎవడో వచ్చి ఆమెను కారులో ఎక్కించుకొని వెళ్లిపోయాడు.

ఆరోజు రాత్రంతా ఆమె పేరునే జపిస్తూ గడిపేశాను. ఆమెది ఎంత అందమయిన పేరో తెలుసా? ఆమె పేరు మీకిప్పుడే చెప్పను. మీరు నమ్మరు. అదే విషయాన్ని పోలీసులు కూడా నమ్మలేదు.


రోజురోజుకీ పెరిగిపోయిన మా పరిచయం ప్రణయం దాకా దారి తీసింది. ఆమె సంగతేమో తెలియదు కానీ నేను మాత్రం పీకల్లోతు ప్రేమలో మునిగిపోయాను. ఆమెనే తలచుకుంటూ కవితల మీద కవితలు రాసేసేవాడిని. వారాలు నెలలయిపోసాగాయి. మా ఇంటినిండా కవితల ప్రవాహమయిపోయింది. ఆమె పరిచయంతో నాలో దాగివున్న కవి విజృంభించసాగాడు. ఆమె అందాన్ని వర్ణిస్తూ పగలూ రాత్రులూ ఏకధాటిగా కవితలు రాసేవాడిని. అలాంటప్పుడే ప్రపంచంలో ఏ రచయితా చేయని ఒక ప్రయోగం చేయాలనిపించింది. ఆలస్యం చేయకుండా నా పథకాన్ని అమల్లో పెట్టేశాను.

ముందుగా షాప్‌కి వెళ్లి కట్టలకొద్దీ తెల్ల కాగితాలు, పెన్నులు కొనేశాను. ఒక మంచి రోజు చూసుకుని నా ప్రేమను ఆమెకు వ్యక్తపరిచాను. ఎగిరిగంతేసి ఒప్పుకుంటుందనుకున్న నాకు నిరాశే ఎదురయింది. ఆలోచించుకోవాలంది. నాకు తెలుసు ఆమె తప్పకుండా నా ప్రేమను అంగీకరిస్తుందని.

ఆమె ఒప్పుకున్న మరుక్షణమే నా ప్రయోగం మొదలుపెట్టాలనే కుతూహలం ఎక్కువవసాగింది. క్రికెట్ ఆడేటప్పుడు ఎలా అయితే లైవ్ కామెంటరీ వుంటుందో అలాగే ప్రేమలోని మధురానుభూతుల్ని ఒక కామెంటరీ రాసేసి ఒక ప్రేమ కావ్యాన్ని రచించాలన్నదే నా ప్రయత్నం. ప్రపంచంలో ఇంతకు ముందెవ్వరూ ఇలాంటి ప్రయత్నం చేసి వుండరని నాకు గొప్ప నమ్మకం.

అనుకున్నట్టుగానే వారం రోజుల తర్వాత ఆమె నా ప్రేమను అంగీకరించింది కానీ అందు కొక కండిషన్ పెట్టింది.

తను పనిచేసే ఆఫీస్ కొలీగ్ ఒకతను ప్రేమ దోమ అంటూ వెంటపడి వేధిస్తున్నాడని, అతని బారినుంచి కాపాడితేనే నా ప్రేమనంగీకరిస్తానంది. అదెంతపని, చిటికెలో వాడి సంగతి తేల్చేస్తానని అతని గురించి మరిన్ని వివరాలు అడిగాను. అతని పేరు చెప్పింది. రెండు నెలల క్రితం ప్రేమిస్తున్నానని చెప్పాడంది. తన కిష్టం



లేదని చెప్పినా, ఫర్వాలేదు, నువ్వు నన్ను ప్రేమించనవసరంలేదు. జస్ట్ ఫీల్ మై లవ్ అంటూ పిచ్చోడిలా వెంటపడి వేధిస్తూ వున్నాడని చెప్పే సరికి నా రక్తం మరిగిపోయింది. అతని పేరు మీకు చెప్పలేదు కదూ? ఇప్పుడే చెప్పను. ఎందుకంటే ఈ విషయం కూడా మీరు ఖచ్చితంగా నమ్మరు. అదే విషయాన్ని విని పోలీసులు నమ్మలేదు సరికదా నన్ను సెల్‌లో పెట్టి చితక్కొట్టారు.

అసలీ ప్రేమకథలోకి పోలీసులెందుకొచ్చారనే మీ అనుమానం తీరే సమయం దగ్గరపడింది. ముందు జరిగిన కథ వినండి.

నేను ప్రేమిస్తున్న అమ్మాయినే ప్రేమించడమే కాకుండా, ప్రేమించకపోయినా ఫర్వాలేదు, ఫీల్ మై లవ్ అంటూ వేధిస్తున్న ఆ వ్యక్తికి సరైన గుణపాఠం నేర్పించి నా అపూర్వ ప్రేమకావ్యాన్ని త్వరలో మొదలుపెట్టాలని ఆత్రుత ఎక్కువయింది. కానీ ఆ మూడో వ్యక్తిని మా ఇద్దరి మధ్యనుంచి తప్పించడమెలాగో అర్థం కాలేదు. అసలే బొత్తిగా లోకజ్ఞానం లేనివాడ్ని. ఏం చెయ్యాలో తోచక సలహాకోసం నా ప్రేయసినే అడిగాను. ఆ రోజు ఆమె చెప్పిన సలహా అద్భుతంగా తోచింది. ఇప్పుడదే విషయం తల్చుకుంటే నా తెలివి తక్కువతనానికి నన్ను నేనే తుపాకీతో కాల్చుకోవాలనిపిస్తుంది.

తప్పు చేసిన వాళ్లని శిక్షించేది పోలీసులే కాబట్టి తనకు తెలిసిన పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కి విషయమంతా చెప్పేద్దామని నిర్ణయానికి వచ్చాం. ఆ ఇన్‌స్పెక్టరు పేరు మీకిప్పుడే చెప్పను గానీ ఆయన దూల్‌పేట్ ఏరియా ఇన్‌స్పెక్టర్ అన్న విషయం మాత్రం చెప్పేస్తాను.

మొత్తానికి ఒక ఆదివారం రోజు ఆ ధూల్‌పేట్ ఏరియా ఇన్‌స్పెక్టర్‌కి విషయమంతా చెప్పేశాం. ప్రేమికుల విషయంలో వేలుపెడితే ఈ రోజుల్లో యూత్ సహించదనీ అందుకే ఆ సమస్యని ఎలాగోలా మేమే పరిష్కరించుకోవాలని ఒక ఉచిత సలహా పడేశాడు ఆ మహానుభావుడు.

ఈ సమస్యను త్వరగా పరిష్కరించుకొని నా రచనా కార్యక్రమంలో మునిగిపోవాలనే తపనలో వున్న నేను ఆ ఇన్‌స్పెక్టర్ కాళ్లావేళ్లా పడ్డాను. పాపం నా బాధ భరించలేక చివరికొక సలహా ఇచ్చాడు. ఉత్తి సలహా మాత్రమే అయివుంటే బావుండేది. సలహాతో బాటు నాకొక తుపాకీ కూడా ఇచ్చాడు. తుపాకీతో వెళ్లి ఆ మూడో వ్యక్తిని బెదిరించమన్నాడు ఈ నాలుగో వ్యక్తి. ఒకవేళ నిజంగానే పేలిపోతుందేమోనన్న నా సందేహానికి ఖాళీ తుపాకీ ఎక్కడైనా పేలుతుందా అని గట్టిగా నవ్వేశాడు.

ఆరోజు రాత్రంతా కూర్చుని పథకాన్ని రూపొందించాను. తుపాకీ చూసి బెదరని వాళ్లు ఎవరు ఉండరని, అందుకే ఖాళీ తుపాకీతో మాఫియా డాన్ లెవల్లో నేను వెళ్లి ఆ మూడో వ్యక్తిని బెదిరించి వార్నింగ్ ఇవ్వాలని ప్లాన్ చేసుకున్నాం. వార్నింగ్ తర్వాత కూడా వాడింకా అలాగే రెచ్చిపోతే ఆ ధూల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ రంగంలోకి దిగుతానని చెప్పడంతో నాకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

అనుకున్నట్టుగానే ఆ తర్వాత రోజు రాత్రి మా పథకాన్ని అమల్లో పెట్టాను. రాత్రి పదింటికి జేబులో ఖాళీ తుపాకీతో నా ప్రియురాలి ప్రేమికుడి ఇంటివైపు బయల్దేరాను. ఆరోజు అమావాస్య అనుకుంటాను. కటిక చీకటి. వీధి దీపాలు కూడా వెలగడం లేదు. నిద్రలో లేపి వార్నింగ్ ఇస్తే ఎక్కువ భయపడ్తాడని ఇన్‌స్పెక్టర్ చెప్పడంతో ఇంట్లో లైట్లన్నీ ఆగిపోయేవరకూ ఇంటి బయటే తచ్చట్లాడాను. చివరకు రాత్రి పన్నెండింటికి మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ అతని బెడ్‌రూమ్‌లోకి దూరి లైట్ ఆన్‌చేసి తుపాకీ అతనివైపు గురిపెట్టానో లేదో....

పోలీస్ సైరన్ కుయ్‌మంటూ మోగింది.

పోలీసుల బూట్ల చప్పుడు దగ్గరకాసాగింది.

చుట్టూ ఒక్కసారి చూశాను. బెడ్‌రూమంతా రక్తం. రక్తపుమడుగులో ఒక వ్యక్తి. అంతే దాని తర్వాత ఏం జరిగిందో నా కసలు గుర్తులేదు. రక్తం చూసి నేను స్పృహతప్పిపోయాను.

చల్లని నీళ్లు మొహాన కొట్టినట్టనిపించడంతో ఉలిక్కిపడిలేచాను.

**తుపాకీ చూసి బెదరని వాళ్లు ఎవరూ ఉండరని, అందుకే ఖాళీ తుపాకీతో మాఫియా డాన్ లెవల్లో నేను వెళ్లి ఆ మూడో వ్యక్తిని బెదిరించి వార్నింగ్ ఇవ్వాలని ప్లాన్ చేసుకున్నాం. వార్నింగ్ తర్వాత కూడా వాడింకా అలాగే రెచ్చిపోతే ఆ ధూల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ రంగంలోకి దిగుతానని చెప్పడంతో నాకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది.**

వజ్రాలెక్కడ?

మీ గ్యాంగ్ ఎంత మంది?

ఇంతకు ముందు ఇంకేమి నేరాలు చేశావు?

ప్రశ్నలు... ప్రశ్నల మీద ప్రశ్నలతో నన్ను హింసించసాగారు పోలీసులు.

నిజం చెప్తామన్నా నా మాట వినే వాళ్లెవరూ లేరక్కడ. వాళ్లడిగే ప్రశ్నలకు ఒక్కదానికి కూడా నా దగ్గర సమాధానం లేదు. ఆ రోజంతా ఇంటరాగేషన్‌లో నా కర్థమయిన విషయమేమిటంటే ఆ చనిపోయిన వ్యక్తి మూల్‌చంద్ అనే పెద్ద వజ్రాల వ్యాపారి అని అతని వద్ద వున్న వజ్రాలు కాజేయడానికి నేనే అతన్ని చంపేశానని పోలీసుల నమ్మకం.

నమ్మినా నమ్మకపోయినా పోలీసులకు నా కథ మొత్తం చెప్పేశాను. రచయిత కావాలనే నా కలల గురించి, భూమిక అనే అమ్మాయితో నా పరిచయం గురించి, ఆమెను ఆర్య అనే వ్యక్తి ఫీల్ మై లవ్ అని వేధించడం, ధూల్‌పేట్ ఏరియా ఇన్‌స్పెక్టర్ గౌరి నాకు ఖాళీ తుపాకీ ఇవ్వడం వరకూ మొత్తం చెప్పేశాను. నా కథంతా విన్న పోలీసులు ఒకరి మొహాలు ఒకరు చూసుకొని పగలబడి నవ్వేశారు.

భూమిక, ఆర్య, గౌరి, ఫీల్ మైలవ్, ఏరియా ధూల్‌పేట్... అని గట్టిగా అరుస్తూ పగలబడి నవ్వసాగారు. నవ్వితే నవ్వారు. నన్ను చితక్కొట్టారు. నిజం చెప్పమన్నారు. నేను డబ్బులు పోసి కొన్న స్కూటర్ కూడా నాది కాదన్నారు. నాంపల్లిలో కొట్టేశానన్నారు. అంతే కాకుండా నాకు సినిమాల పిచ్చన్నారు. చిన్నప్పుడెప్పుడో చూసిన ఒక ఎన్.టి.ఆర్ సినిమా తప్ప మరే సినిమాలు చూడని నన్ను సినిమా పిచ్చోడనంతో నాకు చాలా కోపమొచ్చింది. వాళ్లలా ఎందుకు పగలబడి నవ్వుతున్నారో నాకర్థం కాలేదు. నాకసలే బొత్తిగా లోకజ్ఞానం తక్కువ.

అసలు నేను చేసినతప్పేంటో నాకర్థంకాలేదు. కావాలంటే ధూల్‌పేట్ ఏరియా ఇన్‌స్పెక్టర్‌ని పిలిపించమన్నాను. అక్కడకొచ్చిన ఇన్‌స్పెక్టర్‌ని చూసి నా కళ్లు తిరిగాయి. ఆ వచ్చినాయన గౌరి కాదు. ఆయన పేరు ఇమ్రాన్‌ఖాన్ అంట. మరి నాకు తుపాకీ ఇచ్చిన ఆ గౌరి ఎవరో నాకర్థం కాలేదు. వీళ్లందరూ నన్ను మోసం చేసినా నా భూమిక నాకు తప్పక సహాయం చేస్తుందని గుర్తుకు రావడంతో పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్టయ్యింది. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు నా కోసం భూమిక ట్యాంక్ బండ్‌కు వస్తుందని చెప్పి పోలీసుల్ని అక్కడకు తీసుకొచ్చాను ఎనిమిదయినా రాలేదు. అదేంటో విచిత్రం ఆమె సెల్‌ఫోన్ కూడా పనిచేయలేదు ఆరోజు.

దాంతో నా కర్థమయిపోయింది నేను పెద్ద కేసులో ఇరుక్కుపోయానని. నా కలల సౌధం నా కళ్లముందే కుప్పకూలిపోయింది. ఏ పాపమూ తెలియని నేను ఇలా అన్యాయంగా పోలీసుల చేతికి దొరికిపోవడం చాలా బాధగా అనిపించింది. ఒకవైపు భరించలేని కోపం... మరోవైపు బాధ అప్పుడే నాకు తెగింపు కలిగింది. నా కథ చెప్పినా పోలీసులు నమ్మరనే విషయం తేలిపోయింది. నాకంత బలం ఎక్కడ్నుంచి వచ్చిందో తెలియదు కానీ ఒక్కసారిగా నన్ను చుట్టుముట్టివున్న పోలీసుల్ని రోడ్డు మీదకు తోసేసి గుడ్డిగా పరిగెత్తాను. అలా పరిగెట్టి పరిగెట్టి ఇప్పుడిక్కడికి చేరుకున్నాను. మీరైనా చెప్పండి. నా కథ అబద్ధమంటారా?

భూమిక, గౌరి, ఆర్యలు కలిసి నన్నిందులో ఇరికించారంటారా?

పోలీసులేమో అసలలాంటి వాళ్లెవరూ లేరంటారేంటి?

ఇదంతా నేను కల్పించిన కట్టుకథ అంటారేంటి?

అరే, బూట్లలోపల ఏదో ఎత్తుగా వుందేంటి?

ఇవి వజ్రాలలా వున్నాయేంటి?

నా బూట్లలోకి వజ్రాలెలా వచ్చాయి?

ఈ వజ్రాల సంగతి మీకేమైనా తెలుసా?

ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలెవరికైనా తెలుసా?

తెలిస్తే వచ్చి నా తరుపున సాక్ష్యం చెప్పి నన్నీ కేసులోంచి బయటపడెయ్యరూ! ప్లీజ్.

★